సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



వైభవంగా పట్టాభిషేకం
ఉంగుటూరు మండలం గోపినాథపట్నంలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు ఘనంగా జరిగాయి. 8లో



పోటెత్తిన భక్తులు
ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి మూడో రోజు సోమవారం భక్తులు పోటెత్తారు. అన్ని విభాగాలు కిటకిటలాడాయి. 8లో



ఏజెన్సీపై మంచు దుప్పటి
పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో చలి పంజా విసురుతోంది. వారం రోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. 8లో

న్యూస్‌రీల్

నేడు 'ఆడుదాం ఆంధ్ర' మారథాన్



జేసీ రామసుందర్‌రెడ్డి

భీమవరం: భీమవరం అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు మంగళవారం ఆడుదాం ఆంధ్ర మారథాన్ నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న రీతిలో ఆడుదాం ఆంధ్ర పేరిట ఆటల పోటీలను 47 రోజుల పాటు పెద్ద ఎత్తున నిర్వహించనుందన్నారు. పేదల్లో క్రీడాస్ఫూర్తిని రగిలించి ఉత్తమ క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమన్నారు. ఆడుదాం ఆంధ్రపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మంగళవారం ఉదయం 7 గంటలకు మారథాన్ నిర్వహించనున్నామన్నారు. ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి తదితరులు పాల్గొంటారన్నారు. మారథాన్ అనంతరం లూథరన్ గ్రౌండ్స్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కరాటేలో పతకాలు


రాష్ట్రస్థాయి పతకాలతో విజేతలు

ఏలూరు రూరల్: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఏలూరు క్రీడాకారులు సత్తాచాటారని శిక్షకులు ఎండీ ఖాజా ప్రకటనలో తెలిపారు. చిత్తూరులో జరిగిన 6వ స్కై ఆంధ్ర రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో 11 ఏళ్ల విభాగంలో పవన్ కుమార్, 14 ఏళ్ల విభాగంలో కె.ఓవైసీరాజ్, శ్రీనివాస్, రేవంత్, భార్గవ్, బాలికల విభాగంలో లహరి, రమ్య బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు. 17 ఏళ్ల విభాగంలో కె.అహ్మద్ రాజ్, 18 ఏళ్ల విభాగంలో ఆర్.జయంతి స్వర్ణ, చైతన్య రజత, బాలికల విభాగంలో జి.అఖిల స్వర్ణ పతకంతో సత్తాచాటారని తెలిపారు.

3 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీత్యాగరాజ మ్యూజిక్ అకాడమీ (త్యాగరాజ భక్త సభ) ఆధ్వర్యంలో జనవరి 3 నుంచి 8వ తేదీ వరకు 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు, త్యాగరాజ స్వామి వారి 176వ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, కారుమూరి ఆదిత్య తెలిపారు. సోమవారం ఇక్కడ జరిగిన సమావేశంలో బ్రోచర్‌ను విడుదల చేసి మాట్లాడారు. 3 నుంచి 6 వరకు సాయంత్రం 6.30 గంటల నుంచి భీమవరం ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం, 7,8 తేదీల్లో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో ఆరాధనోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్, సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి మాట్లాడుతూ 3న ఉదయం 8.30 గంటలకు స్వామివారి ఊరేగింపు, సాయంత్రం 6.30 గంటలకు 24 మంది బృందంతో నృత్యం, 4న వీణ కచేరీ, 5న లతాంగి సిస్టర్స్‌చే గాత్రం, 6న ఉదయం 10 గంటలకు త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనలు, సాయంత్రం 6.30 గంటలకు బెంగళూరు బ్రదర్స్‌చే గాత్రం, 7న హరికథ, 8న పాహిరామ ప్రభో సంగీత రూపకం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, కారుమూరి బాబు పాల్గొన్నారు.


ఏలూరు లూథరన్ చర్చిలో విశ్వాసులు

ఏలూరు అమలోద్భవి కథీడ్రల్‌లో క్రిస్మస్ ప్రార్థనలు చేస్తున్న బిషప్ పొలిమెర జయరావు

శాంతి సందేశం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవ మందిరాల్లో మత పెద్దలు క్రిస్మస్ సందేశం ఇచ్చారు. విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కరుణామయుడిని స్తుతిస్తూ గీతాలు ఆలపించి సంబరాలు చేసుకున్నారు.

– ఏలూరు (ఆర్ఆర్‌పేట)

ముఖ్యమంత్రి పర్యటనకు
ఏర్పాట్లు ముమ్మరం


సభావేదిక పనులు

29న సీఎం జగన్ భీమవరం రాక

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 29న భీమవరం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. భీమవరం వేదికగా సీఎం జగన్ విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించనున్నారు. భీమవరంలోని గ్రంధి వెంకటేశ్వర జూనియర్ కళాశాల వెనుక ఉన్న లేఅవుట్‌లో భారీ బహిరంగ సభ, వేదికకు ఏర్పాట్లు చేస్తున్నారు. భారీస్థాయిలో టెంట్లు, వీఐపీలు, సాధారణ ప్రజల వాహనాల పార్కింగ్ ప్రాంతాలను సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తూ పనులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.


హెలీప్యాడ్ వద్ద సూచనలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

హెలీప్యాడ్ సిద్ధం

భీమవరం లూథరన్ గ్రౌండ్‌లో హెలీప్యాడ్ పనులను ఆర్అండ్‌బీ అధికారులు వేగంగా పూర్తిచేశారు. హెలీప్యాడ్‌ను ఎస్పీ యు.రవిప్రకాష్, అధికారులు పరిశీలించారు. ఇక్కడ హెలీప్యాడ్ వద్ద సీఎం జగన్ హెలికాప్టర్ దిగి రోడ్డు మార్గంలో సభా వేదికకు చేరుకుంటారు.

విద్యారంగం..శిఖరాగ్రం

ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా పేద పిల్లల భవితకు బంగారు బాటలు వేస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పేదలకు ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా చదువుల విప్లవానికి శ్రీకారం చుట్టారు. అమ్మఒడి, నాడునేడు, విద్యాకానుక, వసతి దీవెన, విద్యా దీవెన, డిజిటల్ విద్య, గోరుముద్ద తదితర కార్యక్రమాల ద్వారా అండగా నిలుస్తున్నారు. రాష్ట్రంలో విద్యా సంస్కరణలతో అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు పోటీపడేలా చర్యలు తీసుకున్నారు. 2023లో విద్యారంగాన్ని శిఖరాగ్రానికి చేర్చారు.

చదువుల విప్లవం
- పేదల విద్యకు ప్రాధాన్యం
- 1.43 లక్షల మందికి అమ్మఒడి
- నాడు–నేడులో సుందరంగా పాఠశాలలు
- కార్పొరేట్ స్థాయిలో వసతులు
- డిజిటల్ తరగతులతో విద్యాభివృద్ధి

2023 రౌండప్ – విద్య

సాక్షి, భీమవరం : జిల్లాలో 1,075 ప్రాథమిక, 86 ప్రాథమికోన్నత, 211 ఉన్నత పాఠశాలల్లో మొత్తంగా 1,13,584 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ ఏడాదిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు సంబంధించి అమ్మఒడి పథకం కింద 1,43,534 మంది తల్లుల ఖాతాలకు రూ.21.05 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు.

కార్పొరేట్ స్థాయిలో..

మనబడి–నాడు నేడు పథకంలో ప్రభుత్వం పాఠశాలలు, హాస్టళ్లు, జూనియర్ కళాశాలలు, రెసిడెన్షియల్స్ పాఠశాలలు, మండల వనరుల కేంద్రాలు, భవిత కేంద్రాలను అభివృద్ధి చేస్తోంది. జిల్లాలో రెండో విడతగా ఈ ఏడాది రూ.109 కోట్లతో 633 పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. అదనపు తరగతి గదులు, టాయిలెట్స్, ప్రహరీలు, రక్షిత నీరు, డైనింగ్ హాళ్లు తదితర మౌలిక వసతులు కల్పిస్తున్నారు.

అమ్మచేతి 'గోరుముద్ద'లా..

విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. రోజుకో మెనూ అమలుచేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. 80 శాతానికి పైగా విద్యార్థులు భోజనాన్ని తీసుకుంటున్నారు. జిల్లాలో సుమారు 90 వేల మంది మధ్యాహ్న భోజనం తింటుండగా ప్రభుత్వం నెలకు రూ.4 కోట్లు వెచ్చిస్తోంది.

విద్యాకానుక.. ప్రగతి వీచిక

పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్స్‌ను తగ్గించి స్థూల నమోదు నిష్పత్తిని మెరుగుపర్చడం, అభ్యాసన కార్యకలాపాల్లో విద్యార్థుల భాగస్వామ్యాన్ని మెరుగుపర్చేందుకు రెండేళ్లుగా ప్రభుత్వం విద్యాసంవత్సరం ప్రారంభంలోనే జగనన్న విద్యా కానుక (జేవీఎస్) కిట్లను అందజేస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 1,13,584 మంది విద్యార్థులకు రూ.26.12 కోట్ల విలువైన జేవీఎస్ కిట్లను పంపిణీ చేశారు. ఒక్కో కిట్టులో మూడు జతల యూనిఫామ్స్, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, జత షూ, రెండు జతల సాక్స్‌లు, స్కూల్ బ్యాగ్, ప్రాథమిక, మాధ్యమిక విద్యార్థులకు అదనంగా డిక్షనరీలు అందించారు.


భీమవరం మండలం వెంపలో నాడు-నేడులో అభివృద్ధి చేసిన పాఠశాల


తరగతి గదిలో విద్యార్థినులు (ఫైల్)


కుళాయిల వద్ద చేతులు శుభ్రం చేసుకుంటూ.. (ఫైల్)

జగనన్న 'దీవెన'లు

ఆర్థికపరమైన ఇబ్బందులతో పేద విద్యార్థులు మధ్యలో ఉన్నత చదువులు ఆపకుండా జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాల ద్వారా ప్రభుత్వం సాయం అందిస్తోంది. ఈ ఏడాది జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకం కింద బీసీ, ఈబీసీ, కాపు సామాజిక వర్గాలకు చెందిన 37,123 మందికి రూ.96.03 కోట్లు, ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 5,704 మందికి రూ. 5.78 కోట్లు అందజేసింది. వసతి దీవెన పథకం కింద బీసీ, ఈబీసీ, కాపు విద్యార్థులు 36,699 మందికి రూ.35.14 కోట్లు, ఎస్సీ విద్యార్థులు 5,558 మందికి రూ.3.74 కోట్లు అందజేసింది. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ఆరుగురు విద్యార్థులకు 1.25 కోట్ల సాయాన్ని ప్రభుత్వం అందజేసింది.

అమ్మఒడి	1,43,534 మందికి రూ.21.05 కోట్లు
నాడు–నేడు	633 పాఠశాలలకు రూ.109 కోట్లు
జగనన్న విద్యాకానుక	1,13,584 మంది.. రూ.26.12 కోట్లు
ట్యాబ్‌లు	13,790
డిజిటల్ విద్య	191 పాఠశాలలు

డిజిటల్ తరగతులు

దృశ్య, శ్రవణ విద్య ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మెరుగుపడుతుందన్న ఉద్దేశంతో ఎనిమిదో తరగతి నుంచి డిజిటల్ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్, స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందిస్తున్నారు. ఈ ఏడాది 13,790 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేయాల్సి ఉండగా తొలివిడతగా 5,590 మందికి పంపిణీ చేశారు. వారం రోజుల్లో మిగిలిన వారికి అందించనున్నారు. డిజిటల్ విద్యలో భాగంగా 191 ప్రాథమిక పాఠశాలలకు స్మార్ట్ టీవీలు, ఇతర సామగ్రిని అందజేస్తున్నారు.

ఫలితం 'పది'లం కావాలని..

జిల్లాలో గత విద్యాసంవత్సరంలో 20,268 విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా 13,362 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 65.93 శాతంగా ఉంది. సప్లిమెంటరీకి 8,717 మంది హాజరుకాగా 4,156 మంది ఉత్తీర్ణులయ్యారు. మిగిలిన వారిలో కొందరిని రీ అడ్మిట్ చేసుకోవడం, ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 21,341 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం


మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: క్రీస్తు మార్గం అనుసరణీయమని, విశ్వాసులంతా అదేమార్గంలో పయనిస్తూ పొరుగువారిని ప్రేమించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. క్రిస్మస్ సందర్భంగా తణుకులోని పలు చర్చిల్లో సోమవారం ఆయన ప్రార్థనల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. తణుకు కూరగాయల మార్కెట్ ప్రాంతంలోని హోసన్నా మందిరంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తాను ఏసుక్రీస్తు తోడుతో ఈ స్థాయిలో ఉన్నామన్నారు. రాబోయే రోజుల్లో సైతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరింత మంచి జరిగేలా విశ్వాసులంతా ప్రార్థన చేయాలని కోరారు. ముందుగా పాస్టర్ జాన్‌పాల్ మంత్రి కారుమూరికి మంచి జరగాలని ప్రత్యేక ప్రార్థన చేశారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మురాల సుధాకర్, విశ్వాసులు పాల్గొన్నారు.

మనస్తాపంతో ఆత్మహత్య

భీమవరం అర్బన్: మనస్తాపంతో యువతి ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తోకతిప్ప గ్రామంలో చోటుచేసుకుంది. భీమవరం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తిరుమాని నీరజ (20) నల్లజర్లలో బీఫార్మసీ చదువుతోంది. కొంతకాలంగా అనారోగ్యంగా ఉండటంతో తండ్రి ఏసుబాబు ఆమె వైద్యం కోసం రూ.20 లక్షలకు పైగా ఖర్చు పెట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం నీరజ మనస్తాపంతో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఏసుబాబు ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● శ్రీ ఆంజనేయం



శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం.. స్మరణలు మార్మోగాయి. గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో సోమవారం అధిక సంఖ్యలో హనుమాన్ దీక్షధారులు ఇరుముడులు సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– జంగారెడ్డిగూడెం రూరల్

● శ్రీవారి దివ్య దర్శనం



చినవెంకన్నకు అడుగడుగునా భక్తులు నీరాజనాలు అర్పించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ద్వారకాతిరుమల క్షేత్రంలో సోమవారం శ్రీవారి తిరువీధి సేవ నేత్రపర్వంగా సాగింది. పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లతో పాటు గోదాదేవితో కలిసి స్వామివారు భక్తులను కటాక్షించారు.

– ద్వారకాతిరుమల

'తమ్మిలేరు' పనులు ఆలస్యం

చింతలపూడి: ఏలూరు జిల్లాలో మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల్లో ఒకటైన తమ్మిలేరు జలాశయం ఎడమ కాలువ మరమ్మతు పనులు ఆలస్యం కానున్నట్టు నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. మిచాంగ్ తుపాను కారణంగా భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో పనులకు ఆటంకం ఏర్పడింది. జలాశయంలో ప్రస్తుతం 344 అడుగులకు నీటి మట్టం చేరిందని, దీంతో పంట కాలువల మరమ్మతుల పనులు చేయడం సాధ్యం కాదని తమ్మిలేరు ప్రాజెక్ట్ డీఈ బి.శ్రీనివాసరావు తెలిపారు. జలాశయంలో నీటిమట్టం తగ్గిన తర్వాత జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేసవిలో కాలువల పటిష్టతకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాజెక్టు ఆధునీకరణ నిమిత్తం జపాన్ ఆర్థిక బ్యాంక్ నుంచి 2018లో రూ.16.91 కోట్ల రుణం మంజూరైంది. అయితే అప్పటి టీడీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచి వదిలేయడంతో పనులు ప్రారంభం కాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం జగన్ తమ్మిలేరు ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు చొరవతో ఆసుపత్రికి తరలింపు



నెగ్గిపూడిలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: నెగ్గిపూడి లాకుల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు చొరవతో క్షతగాత్రులను సకాలంలో 108లో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. పోడూరు మండలం జగన్నాథపు రానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మొదలవలస వెంకటరమణ బైక్‌పై వెళుతూ లాకుల వద్ద ఉన్న షాపు వద్ద ఆగి ఉండగా, గణపవరం మండలం పిప్పరకు చెందిన కేతా ఉదయ్ కుమార్ మరో బైక్‌పై వేగంగా వస్తూ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటరమణకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళుతున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు కారు దిగి వచ్చి వెంటనే 108కు సమాచారం అందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణకు మెరుగైన వైద్యం అందించాలని తణుకులోని ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యులు శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

మెర్రీ క్రిస్మస్

ఉమ్మడి జిల్లాలో క్రిస్మస్ పండుగను సోమవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు జననం సందర్భంగా ఏసును కీర్తిస్తూ గీతాలను ఆలపించారు. కేక్‌లను కట్ చేసి విశ్వాసులకు పంచారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పలు చోట్ల వేడుకల్లో ప్రజా ప్రతినిధులు హాజరై క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో వినూత్నంగా మహిళలు బాల ఏసును పల్లకీలో ఊరేగించడం విశేషం.

– సాక్షి, నెట్‌వర్క్



నరసాపురం: నరసాపురం లూథరన్ చర్చిలో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



గణపవరం: బువనపల్లి చర్చిలో చిన్నారులతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



పెదవేగి: భోగాపురంలో నాయకులు, విశ్వాసులతో కలిసి క్రిస్మస్ కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



పాలకొల్లు అర్బన్: పాలకొల్లు లూథరన్ చర్చిలో బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు



పెనుగొండ: ఆచంటలో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు లూథరన్ చర్చిలో భారీ కేక్ కట్ చేస్తున్న దృశ్యం



కైకలూరు: మన్నా చర్చిలో ఎమ్మెల్యే డీఎన్నార్‌కు ఏసు చిత్రపటాన్ని బహూకరిస్తున్న పాస్టర్ తదితరులు



ద్వారకాతిరుమల: దొరసానిపాడులో బాల ఏసును పల్లకీలో ఊరేగిస్తున్న మహిళలు



తణుకు టౌన్: తణుకులో వేడుకల భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విశ్వాసులు

మృతుడి వివరాలు లభ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని చక్రదేవరపల్లి ఎర్రకాలువ వద్ద ఆదివారం లభ్యమైన మృతదేహాన్ని అనకాపల్లి జిల్లా నాచవరం మండలం ధర్మవరం గ్రామానికి చెందిన బండి సూరిబాబు (43)గా గుర్తించినట్లు లక్కవరం ఎస్సై దుర్గామహేశ్వరరావు చెప్పారు. సోమవారం ఆయన వివరాలను వెల్లడించారు. ధర్మవరానికి చెందిన సూరిబాబుతో పాటు మరో 10 మంది వేగవరంలో పైలి సూర్యనారాయణ చెరకు తోటలో బంటా కూలి పనులు నిర్వహించేందుకు ఇటీవల వచ్చారు. సూరిబాబు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఇదిలా ఉండగా, ఈనెల 18వ తేదీ నుంచి సూరిబాబు కనిపించకపోవడంతో బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎర్రకాలువ ప్రాంతంలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. తోటి కూలీలు మృతదేహాన్ని పరిశీలించి సూరిబాబుదిగా గుర్తించారు. ప్రమాదవశాత్తు ఎర్రకాలువలో జారి పడి మృతి చెంది ఉండవచ్చన్నారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బహిరంగ వేలం ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.2952/2023/E1

తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో గల పాత పుస్తకాలు/పాత పేపర్లు, పనిచేయని పీఠిలైట్లు మరియు ఎలక్ట్రికల్ స్క్రాప్, పారిశుద్ధ్యం మరియు ఇంజనీరింగ్ వాహనాల స్క్రాప్, హెడ్‌వాటర్ వర్క్స్ స్క్రాప్ మొదలైనవి వేలం వేయుటకు ఈ దిగువ చూపబడినవి.

వ.నెం.	స్క్రాప్ వివరణ	కిలోలలో మొత్తం బరువు (సుమారు.) కేజీలో
1.	పాత అల్యూమినియం	1692.00 kgs
2.	పాత ఇనుము (m.s)	11657.00 kgs
3.	పాత ఇనుము (బీడు)	2950.00 kgs
4.	పాత పుస్తకాలు/పాత పేపర్లు	1320.00 kgs

పై దాఖలైన స్క్రాప్ వివరములకు అంచనా విలువ రూ.7,16,751/- తెలిపిరి. సదరు బహిరంగ వేలం పురపాలక సంఘ కార్యాలయపు ఆవరణములో నిర్వహించబడును. బహిరంగ వేలం రుసుము రూ.500/- కార్యాలయము నందు చలానా రూపమున తేది: 28.12.2023 లోపు న చెల్లించి తేది: 30.12.2023 న జరుగు బహిరంగ వేలం నందు రూ.5000/- డి.డి.రూపమున ధరావత్తు చెల్లించి వేలం నందు పాల్గొనవలెను.

వేలం నందు అధికముగా పాటలో పాల్గొనిన వారికి తదుపరి మిగిలిన సొమ్మును చెల్లించి 3 దినములలో పని పూర్తి చేయవలెను.

కమీషనరు
తాడేపల్లిగూడెం పురపాలక సంఘం

స్విమ్మింగ్ జాతీయ పోటీలకు ఎంపిక



పతకంతో షేక్ హకీల్

ఏలూరు రూరల్: ఏలూరు నగరానికి చెందిన షేక్ హకీల్ స్విమ్మింగ్, వాటర్ పోలో పోటీల్లో సత్తా చాటుతున్నాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇటీవల నరసారావుపేటలో జరిగిన జూనియర్, సబ్‌జూనియర్ స్విమ్మింగ్ పోటీల్లో 200, 400 మీటర్ల విభాగంలో పాల్గొని రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. ఇదే క్రమంలో వాటర్ పోలో అంశంలో సైతం ప్రతిభ చాటాడు. దీంతో సెలెక్టర్లు హకీల్‌ను ఈ నెల 27 నుంచి 29 వరకు బెంగళూరులో జరిగే వాటర్‌పోలో పోటీలతో పాటు జనవరి 2 నుంచి 10వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక చేశారు. ఏలూరులో కోచ్ గణేష్ వద్ద శిక్షణ పొందిన హకీల్‌ను కోచ్‌తో పాటు సీనియర్ క్రీడాకారులు, తల్లిదండ్రులు అభినందించారు.

వైభవంగా శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం

- గోపీనాథపట్నంలో ముగిసిన భక్తాంజనేయ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు
- ప్రత్యేక పూజలు చేసిన ఉప ముఖ్యమంత్రి కొట్టు దంపతులు



శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ సారథ్యంలో గోపీనాథపట్నంలో నిర్వహిస్తున్న శ్రీభక్తాంజనేయ స్వామివారి ఆలయంలో శిఖర ప్రతిష్ఠ, ముక్కోటి మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ ఆలయంలో గత నెలలో శ్రీభక్తాంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరిగాయి. తిరిగి ఈనెల 19వ తేదీ నుంచి ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం, 21వ తేదీ నుంచి ముక్కోటి మహోత్సవాలు శాస్త్రోక్తంగా, అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రఖ్యాత వేద పండితులు వేదాంతం రాజగోపాలచక్రవర్తి ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జరుగుతున్న ఈ మహాక్రతువు సోమవారంతో ముగిసింది. ముంగిపు కార్యక్రమంలో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. మంత్రి కొట్టు సత్యనారాయణ, సాధని కుమారి దంపతులు, ఆయన సోదరులు కొట్టు మురళి, కొట్టు తాతాజీ దంపతులు పీటలపై కూర్చుని శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు సమర్పించి శ్రీరాములు వారికి స్వర్ణకిరీటం, సీతా లక్ష్మణ ఆంజనేయ స్వాములకు వెండి కిరీటాలు సమర్పించారు. ఈ సందర్భంగా పట్టాభిషేకం నిర్వహించిన మంత్రి కొట్టు దంపతులు పుణ్యస్నానం ఆచరించారు. రుత్వికులు, వేద పండితులు, అర్చక స్వాముల వేద పఠనం, మంత్రోచ్ఛరణలు, వాయిద్య కారుల మేళతాళాలతో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం ఎంతో కనుల పండుగగా కొనసాగింది. దీనిని తిలకించేందుకు తాడేపల్లిగూడెం, ఉంగుటూరు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, సింహాచలం దేవస్థానాల నుంచి వచ్చిన ధర్మ ప్రచార రథాలను భక్తులు దర్శించుకున్నారు. మహాక్రతువు ముగింపు సందర్భంగా ఇందులో పాల్గొన్న రుత్విక్కులు, వేద పండితులు, కళాకారులు, అర్చక స్వాములకు మంత్రి కొట్టు దంపతులు పండిత సత్కారం నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ చేశారు. యూత్ లీడర్ కొట్టు విశాల్, తాడేపల్లిగూడెం ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, జెడ్పీటీసీ సభ్యులు ముత్యాల ఆంజనేయులు, విజయవాడ కనకదుర్గమ్మ గుడి ట్రస్ట్ బోర్డ్ ప్రత్యేక ఆహ్వానితులు చెన్నా జనార్దన్ రావు, మండల పార్టీ ప్రెసిడెంట్, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్ర కుమార్, యూత్ ప్రెసిడెంట్ ములకాల రాంబాబు, ఆరుగొలను సొసైటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ, టీఎల్ఎఫ్ ప్రెసిడెంట్ బోలెం రామలక్ష్మి, కనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు కొలుకులూరి రామసీత ధర్మరాజు హాజరయ్యారు.

క్షీరారామ సన్నిధిలో వేద పారాయణం



స్వామివారి సన్నిధిలో వేద పారాయణం చేస్తున్న పండితులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వేద పారాయణం నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి అనంతరం ఆలయంలో ప్రతి సంవత్సరం వేద పారాయణం జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు కిష్టప్ప తెలిపారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి ఆలయంలో వేదస్వస్తి, వేదాశిస్సులు, నీరాజన మంత్రపుష్పములు తదితర పూజలు నిర్వహించారు. వేద పారాయణం వల్ల స్వామివారి యంత్రానికి మరింత బలం పెరుగుతుందన్నారు. ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డు నృత్య ప్రదర్శనల్లో నరసాపురం విద్యార్థినులు



నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్న నరసాపురం కూచిపూడి విద్యార్థినులు

నరసాపురం: పట్టణంలోని శ్రీఆదిపరాశక్తి నృత్య నికేతనం విద్యార్థులు మరోసారి ప్రతిభ చాటారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం రాత్రి గిన్నిస్ వరల్డ్ రికార్డు కోసం కూచిపూడి కళావైభవం పేరుతో 7,209 మందితో ఏకకాలంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. దీనిలో నాట్యాచారిణి వలవల అనంతలక్ష్మి పర్యవేక్షణలో 46 మంది నృత్యనికేతనం విద్యార్థులు పాల్గొన్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు కోసం జరిగిన ఈ నృత్య ప్రదర్శనల్లో నరసాపురం విద్యార్థులు పాల్గొనడం ఇది వరుసగా ఐదోసారి. అనంతలక్ష్మి శిష్య బృందాన్ని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అభినందించారు.

ఏజెన్సీపై మంచు దుప్పటి



చలి మంట కాగుతున్న గిరిజనులు



బుట్టాయగూడెంలో రహదారిపై పొగమంచు

- రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత
- తెల్లవారుజామున కమ్మేస్తున్న పొగమంచు
- రాత్రి 16 డిగ్రీలకు పడిపోతున్న ఉష్ణోగ్రత

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. సాయంత్రం నాలుగు గంటలకే చలిగాలులతో పాటు మంచు కురుస్తోంది. మారుమూల అటవీ ప్రాంతాల్లోని గ్రామాల్లో చలితీవ్రత మరింత తీవ్రంగా ఉంది. గతంతో పోలిస్తే ఈసారి కనిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. చలికి భయపడి ప్రజలు బయటకు రావడానికే జంకుతున్నారు. గత వారం రోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో సాయంత్రం నాలుగు గంటలు దాటితే బయటకు తిరగలేని పరిస్థితి నెలకొంది. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకూ పొగమంచు కమ్మేస్తుంది. ఉదయం 9 గంటలు దాటినా పొగమంచు వీడటం లేదు. చలితీవ్రతతో ఉదయం పాఠశాలకు వెళ్ళే విద్యార్థులతోపాటు పనులకు వెళ్లే కూలీలు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

చలి ప్రభావం తీవ్రంగా ఉండడంతో వృద్ధులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తప్పనిసరి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే నిత్యం మందులు వాడేవారు దుమ్ము, ధూళి పనులకు దూరంగా ఉండాలని, బయట చలుగాలిలో తిరగవద్దని చెబుతున్నారు. చలిగాలుల్లో వాకింగ్‌కు కూడా వెళ్లవద్దని, చలిలో ఎక్కువగా తిరగడం వల్ల రక్తనాళాలు సంకోచించి గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలాగే చలి నుంచి రక్షించుకోవడానికి స్వెటర్లు, మంకీక్యాప్‌లు ధరించాలని సూచిస్తున్నారు.

రక్షణ చర్యలు తీసుకోవాలి

ఏజెన్సీలో చలితీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు బయట ఎక్కువగా తిరగవద్దు. ముఖ్యంగా గుండె, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలి. వేడిగా ఉన్న ఆహారాన్ని మాత్రమే తినాలి.

– జె.సురేష్, వైద్యులు, డీఎంఓ ఇన్చార్జి, కేఆర్‌పురం

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్యక్షేత్రంలో సోమవారం సైతం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు చినవెంకన్న దర్శనం కోసం తరలిరావడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, అన్నదాన సదనం, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది. వరుస సెలవుల నేపథ్యంలో గత మూడు రోజులుగా క్షేత్రంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది.

మద్యం మత్తులో బైక్ అదుపుతప్పి..



మృతి చెందిన అబ్దుల్

దెందులూరు: మద్యం మత్తులో బైక్‌పై వెళుతూ కాలువలోకి దూసుకువెళ్లడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరుకు చెందిన షేక్ అబ్దుల్ (28) గుండుగొలను శివారు భోగాపురానికి చెందిన మౌనిక అనే మహిళతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. అనంతరం తాడేపల్లిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో అబ్దుల్ వార్డు బాయ్‌గా పని చేస్తూ కుటుంబంతో అక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా, ఆదివారం అబ్దుల్ భార్య మౌనికతో కలిసి భోగాపురంలోని అత్తవారింటికి వచ్చాడు. ఈ నేపథ్యంలో రాత్రి మద్యం తాగాడు. అనంతరం బైక్‌పై వెళుతూ పోతునూరు కల్వర్టు వద్ద మలుపు తిప్పుతుండగా అదుపుతప్పి కాలువలో పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దెందులూరు పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొని మహిళ మృతి

ఉంగుటూరు: ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా ఆగిపోగా వెనుక నుంచి స్కూటీ ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. భీమడోలుకు చెందిన పొత్తూరి గాయత్రి (29) తాడేపల్లిగూడెంలోని ఓ ఆస్పత్రిలో తన స్నేహితురాలు డెలివరీ కావడంతో చూసేందుకు తన ఆరు సంవత్సరాల బాబుతో కలిసి స్కూటీపై వెళ్లింది. అనంతరం తిరిగి వస్తుండగా, ఉంగుటూరు టోల్‌ప్లాజా దాటిన అనంతరం ముందు వెళుతున్న లారీ అకస్మాత్తుగా నిలిచిపోగా వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయత్రి తీవ్రగాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతి చెందగా, బాబుకు ఎటువంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న ఎస్సై మణికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. అనంతరం గాయత్రి మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయత్రి భర్త రాజేష్ భీమడోలు కోర్టులో ప్రాసెస్ సర్వర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

మంత్రి కారుమూరిని కలిసిన మానేపల్లి శేఖర్



మంత్రి కారుమూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శిగా ఎంపికైన శేఖర్

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శిగా నూతనంగా ఎంపికైన మానేపల్లి శేఖర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి 31వ వార్షికోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలో నేటి నుంచి 31వతేదీ వరకు స్థానిక సత్యవతి నగర్‌లో వేంచేసియున్న శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి 31వ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సోమవారం తెలిపారు. ఈ ఉత్సవాలు 26వతేదీ మంగళవారం శ్రీగణపతి పూజతో ఈ ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 30వతేదీన పురవీధుల్లో అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తామన్నారు. 31వతేదీన అమ్మవారికి మహాకుంభిషేకం అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



తణుకులో క్రీడాకారులకు క్రికెట్ కిట్‌లు పంపిణీ చేస్తున్న కారుమూరి సునీల్‌కుమార్

తణుకు అర్బన్: యువత క్రీడల్లో రాణించాలని వైఎస్సార్ సీపీ నాయకులు, యువనేత కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద తణుకు మండలం ముద్దాపురం గ్రామానికి చెందిన యువతకు క్రికెట్ కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ యువత మీదే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. యువకులంతా క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరమల్లు ఫణీంద్రకుమార్, కారుమంచి యోహాన్, ఉమ్మిడిసింగ్ శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం మహిళా వాకర్స్‌కు ఉత్తమ క్లబ్ అవార్డు



ఉత్తమ క్లబ్ అవార్డు అందుకుంటున్న మహిళా అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ క్లబ్ అవార్డు లభించింది. విశాఖలో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ ఎ.యు కన్వెన్షన్‌లో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎస్పీ రవీంద్ర నగదు పురస్కారం అందజేశారు. అవార్డు అందుకున్న అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మిని పలువురు మహిళా వాకర్స్, సభ్యులు అభినందించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఇరగవరం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గుడాల లక్ష్మి అన్నారు. సోమవారం ఏలేటిపాడులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్‌లు అందజేశారు. గ్రామ నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఐనంపూడి శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యులు కొవ్వూరి విజయలక్ష్మి, బీజేపీ జిల్లా కార్యదర్శి కొవ్వూరి వెంకటరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు యూత్ క్రిస్మస్

పెంటపాడు: పట్టణంలోని ఎ.క్లాస్ ఫ్యారీస్ చర్చిలో బుధవారం రాత్రి యూత్ క్రిస్మస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ గురుమండల అధ్యక్షుడు డీఎల్ ఫీనిహాస్ తెలిపారు. ప్రత్యేకంగా యూత్ సంఘ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు.

శాంతి మార్గం.. క్రీస్తు సందేశం

క్రీస్తు మందిరాల్లో వైభవంగా క్రిస్మస్ వేడుకలు



పెంటపాడు: గూడెం టౌన్ ఎ.క్లాస్ ఫ్యారిస్ చర్చిలో వాక్యం బోధిస్తున్న సీహెచ్ పురుషోత్తం



తణుకు టౌన్: వేల్పూరులోని సెయింట్ పాల్స్ చర్చిలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

పెంటపాడు: శాంతికి, త్యాగానికి ప్రతీక క్రిస్మస్. విశ్వాసం, ప్రేమ, కరుణ, దయ, నిరీక్షణ, సందేశంతో క్రీస్తు లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. సోమవారం పెంటపాడు, తాడేపల్లిగూడెం, తణుకు పరిసర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు జన్మదినం లోకానికి ఒక పర్వదినం అని సీబీఎం సంస్థకు చెందిన సీనియర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సిహెచ్ పురుషోత్తం పేర్కొన్నారు. ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ పురస్కరించుకొని ఆయన సోమవారం గూడెం లూథరన్ ఎక్లాస్ ఫ్యారిష్ చర్చిలో సంఘ గురుమండల అధ్యక్షుడు ఫినేహస్ ఆధ్వర్యంలో దేవుని వాక్యం బోధించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా యూత్ సంఘ సభ్యులు కీర్తనలు ఆలపించారు. ప్రత్యేక క్రిస్మస్ కేక్ కట్ చేశారు. చర్చి డెలిగేట్ చైర్మన్ మానుకొండ భాస్కరరావు, పీసీసీఎల్‌సీసీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముదునూరుపాడు స్వస్థత శాలలో: ఏసు క్రీస్తు మార్గాన్ని ప్రతి ఒకరూ అనుసరించాలని బైబిలుమిషన్ వైస్ ప్రెసిడెంట్ ఎ. దైవారావు, పేర్కొన్నారు. ముదునూరుపాడు స్వస్థత శాలలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకలలో ఆయన పాల్గొని భక్తులకు వాక్యసందేశం అందించారు. ఈ సందర్భంగా యూత్‌సంఘ సభ్యులు నాటికలు ప్రదర్శించారు. గూడెం భాగ్యలక్ష్మి పేటలోని ఎల్ఎల్ఎం చర్చి ఆవరణలో విమోచన సంస్థ అధినేత, స్థానిక సంఘ కాపరి, పాస్టర్ల సంఘ నాయకుడు మల్లిపూడి జైబాబు ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మల్లిపూడి జాయ్‌బాబు, పలు సంఘాలకు చెందిన దైవసేవకులు సామ్యూల్ సునీల్, సువర్ణరాజు, విజయ్, మల్లిపూడి జమాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు లూథరన్ చర్చిలో:
పెంటపాడు ఇమ్మానియేలు లూథరన్‌చర్చిలో క్రిస్మస్ పురస్కరించుకొని చిన్నారులు కూచిపూడి నృత్యాలు, పలు రకాల నాటికలు ప్రేక్షకుల్ని అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, వైఎస్సార్ సీపీ నాయకులు తాడేపల్లి ఈశ్వరరావు, దేవబత్తుల శ్యామూల్ రాజు, ఎంపీటీసీ దేవాబత్తులు నాగమణి, ఎస్సీ సంఘ నాయకులు బాబీ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

వల్లూరుపల్లి గ్రామంలో : వల్లూరుపల్లి గ్రామంలోని ప్రార్థనాకేంద్రం చర్చిలో సోమవారం ఉదయం నుంచి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సంఘ దైవసేవకురాలు మల్లిపూడి జమాయమ్మ, జాయ్ సంస్థ అధ్యక్షుడ మల్లిపూడి జాయ్‌బాబుల ఆధ్వర్యంలో వేడుకలలో పలువురికి వస్త్రాలు, ప్రేమ విందు ఏర్పాటు చేశారు. పడాల వాక్యజ్యోతి చర్చిలో ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ ఆధ్వర్యంలో ఘనరాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ప్రవక్తిని అమ్మాజీ మాట్లాడుతూ క్రీస్తు బాలుని దీవెనలు ప్రజలకు మెండుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఘనరాజు, కృప పాల్గొన్నారు. గూడెం మండలం ఆరుగొలను బైబిలుమిషను చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సంఘ సేవకులు మద్దా డేవిడ్‌రాజు, షాలెంరాజుల ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలంపురం చర్చిలో పి. విజయరత్నాకర్ దేవుని వాక్యాన్ని భోధించారు. ఆయన ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు.



తాడేపల్లిగూడెం రూరల్: కడకట్ల అరారాతు ప్రార్థన మందిరంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లోని క్రీస్తు మందిరాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దీంతో పట్టణంలోని జూబ్లీ రోడ్డులోని క్రైస్ట్ ఆఫ్ లూథరన్ చర్చి, క్రిస్టియన్ పేట, తాళ్లముదునూరు పాడు, కొండయ్య చెరువు ఫెయిత్ చర్చి, వీకర్స్ కాలనీ, కడకట్ల అరారాతు ప్రార్థన మందిరం, మండలంలోని కుంచనపల్లిలోని స్వస్థతశాలలు క్రీస్తు విశ్వాసులతో కిక్కిరిసి కనిపించాయి. ప్రత్యేక ప్రార్థనలతో ఈ ప్రాంతం మార్మోగింది. కాగా, సాయంత్రం కడకట్లలోని అరరత్ చర్చిలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



పెంటపాడు: ఇమ్మానియేలు లూథరన్ దేవాలయంలో కీర్తనలు ఆలపిస్తున్న యువత

ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

తణుకు: క్రిస్మస్ పురస్కరించుకుని తణుకు పట్టణంలోని పలు చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వేల్పూరు రోడ్డులోని పెంతుకోస్తు చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పాటలు, ఆరాధనతో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ కె.జాయ్ క్రీస్తు జననాన్ని వివరిస్తూ ప్రత్యేక సందేశాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూత్, చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు, ఆటపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

తణుకు టౌన్: మండలంలోని వివిధ గ్రామాల్లో గల క్రిస్మస్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిల్లో జరిగిన వేడుకల్లో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వివిధ చర్చిలలో పాల్గొని క్రిస్మస్ కేక్‌లను కట్ చేశారు. ఈసందర్భంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. తణుకు రూరల్ మండలం వేల్పూరులోని సెయింట్ పీటర్ లూథరన్ చర్చిలో జరిగిన వేడుకలలో మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమాల్లో ఆయా చర్చిల పాస్టర్లు, సంఘ పెద్దలతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన డైరెక్టర్ మెహర్ అన్సారీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వద్ద అన్న సమారాధన

క్రిస్మస్ సందర్భంగా తణుకులోని ఉందుర్తి పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తణుకు శివారులోని డంపింగ్ యార్డు వద్ద పేదల మధ్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈవేడుకలలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి మధ్యాహ్నం భోజనం అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కలిదిండి పద్మావతి, జవ్వాది తమ్మయ్య నాయుడు, గాలింకి ఆశ, ఫౌండేషన్ చైర్మన్ ఉందుర్తి ప్రసన్నకుమార్, పద్మారావు, వార్నర్ పాల్, కారుమూరి ప్రిన్స్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంలో క్రిస్మస్ వేడుకలు జరిగాయి. క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, జోన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, పాండురంగారావులచే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమం నిర్వాహకులు మేఖలేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, నవీన్, ప్రవీణ్, నాగేశ్వరరావు, సూరిబాబు, కె.సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

సామాజిక ఐక్య వేదిక ఆధ్వర్యంలో క్రిస్మస్

తణుకు అర్బన్: కులమతాలకు అతీతంగా పండుగలు నిర్వహించడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ నాయకులు, యువనేత కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని వల్లూరి వారి వీధిలో సామాజిక ఐక్యవేదిక 16వ వార్షికోత్సవ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేకు కట్‌చేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ వీధిలో క్రిస్మస్, వినాయకచవితి, రంజాన్ పండుగలు అన్ని నిర్వహించుకోవడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, సామాజిక ఐక్యవేదిక సభ్యులు పొట్ల రమేష్, వల్లూరి శ్రీరామ్, ఇర్ఫాన్, ముఖర్జీ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తణుకు అర్బన్: సామాజిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సునీల్‌కుమార్ తదితరులు



పెంటపాడు : ఎల్ఎల్ఎమ్ చర్చిలో కొవ్వొత్తులు వెలిగిస్తున్న మహిళలు

ఘనంగా వాజ్‌పేయి జయంతి



వాజపేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లలుర్పిస్తున్న బీజేపీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వాజపేయి జీవిత విశేషాలు, ప్రధానిగా ఆయన చేసిన పరిపాలన విశేషాలను నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈతకోట తాతాజీ, కోట రాంబాబు, ముప్పిడి సురేష్ రెడ్డి, కర్రి ప్రభాకర్ బాలాజీ, పాటే నాగేశ్వరరావు, నవీన్, రమేష్, టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రి కారుమూరి పరామర్శలు

అత్తిలి: అత్తిలికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, బీసీసెల్ నాయకుడు కాసగాని అబ్బులను రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. అబ్బులు మాతృమూర్తి పాపాయమ్మ ఇటీవల మృతి చెందారు. ముందుగా ఆమె చిత్రపటానికి మంత్రి పూలామాలలు వేసి నివాళ్లలర్పించారు. కాసగాని అబ్బులు, కాసగాని హనుమంతరావులను పరామర్శించి, సంతాపం తెలిపారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకుడు కంకటాల సతీష్, కాసగాని చిన్నా తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

బుంగా కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి

కె సముద్రపుగట్టు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బుంగా పద్మారావు సోదరుడు బుంగా రామకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. రామకృష్ణ చిత్రపటానికి మంత్రి కారుమూరి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు ఉన్నారు.



అత్తిలిలో కాసగాని అబ్బులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పాలకోడేరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అత్తిలి మండలం లక్ష్మీనారాయణ పురం శివారు దంపబోయినవారిపాలేనికి చెందిన పుప్పాల వీర వెంకటశివ సత్యనారాయణ(20) నారాయణపురం లిక్కర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఐదు రోజుల క్రితం సొంత ఊరు దంపబోయినవారిపాలెం వచ్చాడు. ఈనెల 21వ తేదీన పని మీద పాలకోడేరు మండలం మోగల్లు మోటార్ సైకిల్‌పై వచ్చాడు. అదేరోజు రాత్రి తిరిగి ఊరుకు వెళుతుండగా లక్ష్మీనారాయణ పురం రోడ్డులో వరి గడ్డిమోపు ని ఢీకొని బైకు అదుపుతప్పి రోడ్డుపై పడడంతో గాయాలపాలయ్యాడు. దీంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆ తరువాత విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. ఈమేరకు ఆసుపత్రి నుంచి సమాచారం అందిందని హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. అనంతరం మృతుడికి పోస్టుమార్టం నిర్వహించినట్లు చెప్పారు. మృతుడు శివ సత్యనారాయణ తండ్రి ప్రకాశం ఇదే రహదారిలో మోటార్ బైక్ ప్రమాదంలో చనిపోయాడు. తల్లి ప్రభావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగరాజు తెలిపారు. ప్రభావతికి ఇద్దరు కుమారులు కాగా శివ సత్యనారాయణ పెద్ద కుమారుడని పోలీసులు తెలిపారు.ఈ సంఘటనతో బోయినవారిపాలెంలో విషాదచాయలు అలుముకున్నాయి.

వంగవీటి మోహన రంగా వీధిగా సొసైటీ రోడ్డు

- రంగా విగ్రహం ఏర్పాటు చేసిన మంత్రి కారుమూరి
- హర్షం వ్యక్తం చేస్తున్న కాపు వర్గాలు
- గతంలో రంగా విగ్రహాన్ని తొలగింపచేసిన మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి
- నేడు వంగవీటి మోహనరంగా వర్ధంతి



తణుకులో వంగవీటి మోహన్‌రంగా రోడ్డుగా సూచిక బోర్డును ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి (ఫైల్)

తణుకు అర్బన్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కాపుల ఆరాధ్యదైవం వంగవీటి మోహనరంగాకు తణుకు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున నీరాజనాలు వెల్లువెత్తుతున్నాయి. కాపు వర్గాలు అధిక సంఖ్యలో ఉన్న తణుకు ప్రాంతంలో రంగా విగ్రహాల ఏర్పాటుకు గతంలో టీడీపీ పాలకులు సహకరించని దుస్థితి. వ్యాపార, వాణిజ్యపరంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న తణుకు పట్టణంలోని ప్రధానమైన వీధికి వంగవీటి మోహన రంగా పేరును ఇటీవలే అధికారికంగా నామకరణం చేశారు. దీంతో తణుకు నియోజకవర్గంలోని కాపు వర్గాలు, రంగా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాపు సంఘం అభ్యర్థన మేరకు...

కాపు సంఘం కోరిక మేరకు గతేడాది నవంబరు 22వ తేదీన తణుకు సొసైటీ రోడ్డులో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మున్సిపల్ కాంప్లెక్స్ ప్రాంతంలో సొంత నిధులతో వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ప్రతిష్ఠింపచేశారు. అయితే విగ్రహం ఏర్పాటు చేసిన సొసైటీరోడ్డును వంగవీటి మోహనరంగా వీధిగా అధికారికంగా మార్పు చేయించాలని కాపు సంఘ నాయకులు లిఖితపూర్వకంగా మంత్రి కారుమూరికి వినతిపత్రం అందచేశారు. వెంటనే స్పందించిన మంత్రి కారుమూరి అధికారికంగా రంగా వీధిగా మార్పించి ఈనెల 10వ తేదీన రోడ్డును ముస్తాబుచేయించి రంగా వీధిగా నామకరణం చేశారు. దీంతో తణుకులాంటి ప్రాంతంలో రంగా బీజాలు ఏర్పాటు చేయడం ఎంతో సాహసమని స్వాగతించారు. అయితే ఆ రోడ్డులో సొసైటీ ఉండడంతోపాటు ప్రసాద్ హాస్పిటల్ కూడా ఉండడంతో ఆ రోడ్డును ఇప్పటివరకు సొసైటీ రోడ్డని, ప్రసాద్ హాస్పటల్ రోడ్డని పిలుస్తుందేవారు. ఇప్పుడు తాజాగా వంగవీటి మోహనరంగా రోడ్డుగా నామకరణం చేయించి బోర్డు ఏర్పాటు చేశారు.

గత పాలకులు తొలగించారు

గత టీడీపీ హయాంలో కాపు యువత ఆధ్వర్యంలో తమ ఆరాధ్య దైవం రంగా బ్రెస్ట్ సైజు విగ్రహాన్ని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలో స్థానిక రాష్ట్రపతి రోడ్డు డివైడర్‌పై ఏర్పాటు చేసుకుని మురిసిపోగా అప్పటి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి మరీ మున్సిపల్ ఉద్యోగులతో ఆటోలో మున్సిపల్ కార్యాలయానికి తొలగించేలా హుకుం జారీ చేశారు. ఆయన ఆదేశాల మేరకు పనిపూర్తి చేసి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఒక మూల విగ్రహాన్ని పారవేశారు. దీంతో కాపు యువత మరల ఆరిమిల్లిని బతిమలాడుకుని విగ్రహాన్ని తెచ్చుకుని కాపు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

రేపు అత్తిలిలో రంగా విగ్రహావిష్కరణ



ఈ నెల 27వ తేదీన అత్తిలి సంతమార్కెట్ ప్రాంతంలో మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో రంగా విగ్రహాన్ని టీమిండియా క్రికెటర్ అంబటి రాయుడు చేతులమీదుగా ఆవిష్కరించనున్నారు.కాపుల ఆరాధ్యదైవం వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని తణుకులో ఏర్పాటు చేయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును కాపు సంఘం తరపున కోరగానే విగ్రహాన్ని తన సొంత నిధులతోనే ఏర్పాటు చేస్తానని మాట ఇచ్చి నిలబెట్టుకున్నారు. అంతేకాకుండా విగ్రహం ఏర్పాటు చేసిన వీధికి వంగవీటి మోహనరంగా వీధిగా నామకరణం చేయమని కాపు పెద్దలంతా కోరగా అదికూడా నెరవేర్చారు. గతంలో మాజీ కౌన్సిలర్ కాపునేత పోలిశెట్టి గోపి విగ్రహాన్ని సైతం ప్రస్తుత మంత్రి కారుమూరి ఏర్పాటు చేయడం విశేషం.

– వంటిద్దు ఈశ్వరప్రసాద్, కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు, తణుకు

గత పాలకులు తొలగించారు



తణుకు నియోజకవర్గంలో కాపులు అత్యధికంగా ఉన్నప్పటికీ 34 వార్డులు ఉన్న తణుకు పట్టణంలో మా ఆరాధ్యదైవం వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోలేకపోయాం. గతంలో కాపు యువత పెట్టుకున్న విగ్రహాన్ని అప్పటి టీడీపీ హయాంలో మాజీ ఎమ్మెల్యే తొలగింపచేశారు. కాపు సంఘం తరపున రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటామని స్థలం ఇప్పించాల్సిందిగా మంత్రి కారుమూరిని కోరగానే సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కాపులంతా ఆయనను అభిమానిస్తున్నారు.

– యిందుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్ సీపీ జేసీఎస్ పట్టణ కన్వీనర్

విగ్రహ ఏర్పాటులో వెనుకబడ్డాం



బడుగు బలహీన వర్గాలతో పాటు కాపులు ఆరాధించే నాయకుడు వంగవీటి మోహనరంగా. అటువంటి నాయకుడిని విగ్రహం ఏర్పాటు చేసుకోవడంలో టీడీపీ నాయకుల కారణంగా వెనుకబడ్డాం. ఈనెల 27వ తేదీన అత్తిలి సంతమార్కెట్ ప్రాంతంలో రంగా, వైఎస్సార్ విగ్రహాలను మంత్రి కారుమూరి సొంత నిధులతో ప్రతిష్ఠింప చేస్తున్నారు. టీంఇండియా క్రికెటర్ అంబటి రాయుడు చేతులమీదుగా విగ్రహ ప్రతిష్ఠ జరగ నుంది. మంత్రి కారుమూరి మంచి మనసును కాపులు అర్థం చేసుకోవాలి.

– పైబోయిన సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయండి

పెంటపాడు: మండలంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ టీవీ రామకృష్ణ తెలిపారు. పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ నుంచి కళాశాల సెంటర్, గేట్ సెంటర్, సంత మార్కెట్, వెల్లంపేట మీదుగా ప్రత్యేక మార్‌థాన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులతో పాటు క్రీడాకారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని క్రీడా మైదానాలను ఆటల పోటీలకు సిద్ధం చేశామన్నారు. మొత్తం 27 గ్రామాలకు చెందిన క్రీడాకారులు ఈ క్రీడా మైదానాల్లో ఆటలు ఆడనున్నారని తెలిపారు. తొలి రోజు మంగళవారం పెదతాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూలులో వాలీబాల్ ప్రారంభమవుతాయన్నారు.